




మున్సిపల్ ఎన్నికలు జరపాలి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికలు వెంటనే జరపాలని సబ్ కలెక్టర్ శ్రీపూజ,మున్సిపాలిటీ కమిషనర్ కె అనూషలకు కందుకూరు నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ సోమవారం వినతి పత్రాలు ఇచ్చారు. కందుకూరు పురపాలక సంఘానికి గత మూడు దఫాలుగా ఎన్నికలు జరగడం లేదు. చివరిసారిగా జూలై 2007లో మున్సిపాలిటీ ఎన్నికలు జరిగినవి. తర్వాత 2012, 2017, 2022లో మున్సిపాలిటీ ఎన్నికలు జరగలేదు. కోర్టులో కేసులున్నాయి అన్న నెపంతో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎన్నికలు జరపలేదు. ఎన్నికల్లో ఓడిపోతామని ప్రతిపక్షాలు, ఎన్నికలు జరపడం ఖర్చు దండగని పాలపక్షం వారు ఎవరికివారు బాధ్యత రాహిత్య వ్యవహరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాడేపల్లికి పోయి విచారించగా దాదాపు 12 సంవత్సరాల నుండి ఈ కేసు తాలూకా రెస్పాండెంట్ కోర్టులో కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని తెలిసింది. ప్రస్తుతం పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాజకీయ నేతలే సమస్యల సృష్టికర్తలు..!

◆ అప్పుడు..ఇప్పుడు అంతా వారే
◆ గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు తలనొప్పులు
◆ ఆక్రోశంతో ఆత్మహత్యాయత్నాలు

అధికారపార్టీ నేతలు.. అప్పుడు..ఇప్పుడు సమస్యలను వారే సృష్టిస్తున్నారు.. తమ అధికారాన్ని అడ్డంపెట్టుకొని గతంలో వైసిపి నేతలు, ఇప్పుడు టిడిపి నేతలు కింద స్థాయి అధికారుల చేత తప్పులు చేయిస్తున్నారు. గ్రామీణ, మండల ప్రాంతాల్లో విఆర్‌ఒ, ఆర్‌ఐ, తహశీలారులు భూరికార్డులను తారుమారు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రాజకీయ నేతలు చెప్పింది, చెప్పినట్లు చేయడంతో ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలు అలానే ఉండిపోతున్నాయి. గత ప్రభుత్వంలో అధికారులు మరీ మరబొమ్మలా చేశారనే విమర్శలున్నాయి. ఇప్పుడు అదే నేతలు మళ్లీ ఇక్కడొచ్చిచేరారు. పేద, మధ్య తరగతి, సామాన్య జనానికి రాజకీయ పలుకుబడి లేకపోవడంతో ఉన్నతాధికారులు చుట్టూ తిరుగుతున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆక్రోశంతో బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారు. ఇది ఉన్నతాధికారులకు తలనొప్పిగా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా పేద, మధ్య, తరగతి జనం బాధలు తీరడం లేదు. గతంలో జరిగిన తప్పులు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో ప్రతి సోమవారం జరుగుతోన్న ప్రజా విజ్ఞప్తుల దినంలో ఎక్కువ భాగం భూ సమస్యలే కనిపిస్తున్నాయి. జిల్లాలోని ఉదయగిరి, మర్రిపాడు, దగదర్తి, రాపూరు, ఇతర మెట్ట ప్రాంతాల్లో వేలాది ఎకరాలు ప్రభుత్వ భూము లున్నాయి. రాజకీయ పలుకుబడి కలిగిన వ్య క్తులు కింద స్థాయి రెవెన్యూ అధికారులను బెదిరించి, బేరమాడి, తమకు అనుకూలంగా రికార్డులు తయారు చేసుకున్నారు. పేదలకు ఒక ఇంటి స్థలం ఇవ్వడానికి నిబంధనలు


ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వృద్ధురాలు


గత వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలయ్య

చూపించే అధికారులు వందలాది ఎకరాలు పెద్దలకు కట్ట బెట్టారు. ప్రతి గ్రీవెన్స్‌లోనూ భయట పడుతున్నాయి. ఇటీవల వరకు సుమారు 329 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. అందులో 8446 ఫిర్యాదుల వచ్చాయి. సర్వే చేయాలని 3412 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంత బాగు న్నా అదికారులకు అర్జీలు పెట్టు కున్న ఆ గ్రామంలోని అధికారపార్టీ నేత చెబితేనే ఫైల్ ముం దుకు కదులుతోంది. గతంలో వైసిపిలో ఉండి భూ రికార్డుల్లో అక్ర మాలు చేయించిన నేతలు, ఇప్పుడు అదికార టిడిపిలో చేరారు. అందుకే సమ స్యలు ఏవీ పరిష్కారానికి నోచు కోవడం లేదు. జలదంకి మండల ంలో సోదరి స్థలం అన్న ఆక్రమించారు. రికార్డులున్నా అధికారులు ముందుకెళ్లడం లేదు. ఆక్రమించిన వ్యక్తి టిడిపి కావడం, ఎంఎల్‌ఎకు అనుకూలం కావడంతో న్యాయం జరగడం లేదు. చేజర్ల మండలంలో 200 ఎకరాలు ప్రభుత్వ భూమి అక్రమించారు. అధికారపార్టీ నేతలు కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి. మర్రిపాడు మండలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు చెందిన భూమి ఓ రాజకీయ నేత అక్రమించారు. గతంలో వైసిపి, ఇప్పుడు టిడిపి ఆయన జోలికి వెళ్లలేని పరిస్థితి. అర్జీలు పట్టుకొని తిరుగు తూనే ఉన్నారు. తమ భూములు కాపాడు కోడానికి ఎక్కడ అధికారం ఉంటే అక్కడ నేతలు వాలిపో తున్నారు. సామాన్య జనంకు మాత్రం ఎలాంటి న్యాయమూ జరగడం లేదు. ప్రతి వారమూ ఉన్నతాధికారులను కలిసి అర్జీలు ఇవ్వడం, దానికి కింద అధికారులకు పంపడం దానికి ఏదొక సాకులు చెప్పడం పరిపాటిగా మారిపోయింది. బోగోలు మండలం, అక్కరాజు కండ్రిగ లో అటవీశాఖ, పశు వుల మేత పోరంబోకు భూములు ప్రయివేటు వ్యక్తులు ఆక్రమణ చేశారని కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నెంబర్ 257,260 లలో ఉన్న అటవీ,మేత పోరంబోకు భూములు ఉండగా 1990లో తెలుగు గంగ కాలువ నిమిత్తం, రెవెన్యూ వారు వాటిని అటవీశాఖకు అప్పచెప్పారు. 92 లో కొంత భాగంలో మొక్కలు నాటి, కొంత ఖాళీగా ఉంచారని ఫిర్యాదు లో పేర్కొన్నారు.కొందరు ఈ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయగా 2016 లో ఆక్రమణలను అడ్డుకోవాలని అప్పటి కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. భూముల ఆక్రమణ కొనసా గిస్తున్నారు. తమ గ్రామం మొత్తం ఇనాం భూమి కాగా 257, 260 సర్వే నెంబర్లలోని భూమిని రీ సర్వే చేసి పట్టాదారు పాస్ పుస్తకాలలో, వన్‌బి అడంగల్‌లో తమ పేర్లను నమోదు చేసు కున్నారని పేర్కొ న్నారు. ఇందుకు స్థానిక ఎం ఎల్‌ఎలు, నేతల ప్రోత్సాహం బాగా ఉన్నట్లు తెలుస్తోంది. బడా బాబులు మాత్రం ఆక్రమణలు చేసి, ఇంట్లో నుంచి బయటకు రాకుండా పనిచేసు కుం టున్నారు. సామాన్య పేద, మధ్యతరగతి జనం మాత్రం అధికారుల చుట్టూ ప్రతివారమూ అర్జీలు పట్టుకు తిరుగుతున్నారు..

పెరుగుతోన్న ఆత్మహత్యాయత్నాలు..!

సామాన్య, పేద, మధ్య తరగతి జనం అధికారుల చుట్టూ తిరిగి, తిరిగి అలసిపోతున్నారు. రాజకీయనేతల ప్రమేయంతో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. రాజకీయ నేతలే జిల్లాలో భూ సమస్యలను సృష్టిస్తు న్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇటీవల ఆత్మహత్యాయత్నాలు పెరుగుతున్నాయి. గత నెల 25న నెల్లూరు కలెక్టరేట్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కావలి మండలం, బుడంగుంట ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంగంశెట్టి బాలయ్య తమ ఇంటి స్థలాన్ని రాజకీయ నేతలు అక్రమించారనే మనస్థాపంతో ఈ పనిచేశారు. తాజాగా సోమవారం మనుబోలు మండలం, వీరంపల్లికి చెందిన తుమ్మల హైమవతి అనే వృద్ధురాలు తన పొలాన్ని ఆక్రమించారని, దౌర్జన్యం చేస్తు న్నారంటూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రజల ఆక్రోశానికి ఇది అద్దం పడుతోంది. రెవెన్యూ రికార్డులు సరిచేయడంతోపాటు, అర్హులకు న్యాయం చేయాల్సి ఉంది. ఉన్నతాధికారులు రాజకీయ జోక్యాన్ని పక్కన పెట్టి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి గడప గడపకు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు రూరల్ లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక ప్రజలతో మరింత మమేకమయ్యేం దుకు రేపటి నుంచి గడప గడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు తీరును ఇంటింటికి వెళ్లి తెలుసుకుంటానన్నారు. ఈ కార్యక్రమం ఏడాది వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 19వ డివిజన్‌లో దీనిని ప్రారంభిస్తు న్నట్లు చెప్పారు. ఎన్నికల కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం లేదని, ప్రజల కోసమే చేస్తున్నామన్నారు. మూడు సార్లు గెలిచిపిన ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడిందన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నా రన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా తాము ప్రజల తరపునే ఉంటామన్నారు. ఎంఎల్‌ఎ కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి పూర్తి సహాయ సహకా రాలుంటాయని తెలిపారు.


మాట్లాడుతున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

దెబ్బతిన్న వరి పైర్ల పరిశీలన.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో దెబ్బతి న్న వరి పైర్లను వ్యవసాయ శాఖ అ ధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వి శిరీష రాణి పర్యవేక్షణలో జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ సహాయ సంచా లకులు జి. లక్ష్మి మాధవి, ఇందుకూ రుపేట వ్యవసాయ సహాయ సంచా లకులు ఏ. రాజ్ కుమార్, ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వద్యా లయం శాస్త్రవేత్తలు ఐ. పరమ శివ మరియు కె. కిరణ్ కుమార్ రెడ్డిలు సోమవారం వరిగొండ పంచాయతీ రావూరువారికండ్రిగ, చిన్న చెరు కూరు గ్రామాలలో పర్యటించారు.కార్య క్రమంలో గ్రామ వ్యవసాయ సహా యకులు జి. సుమంత్, పి. శివ కుమార్, రైతులు పాల్గొన్నారు.

చిరువ్యాపారస్తులను వేధించడం సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక 17వ డివిజన్ ప్రాంతంలో వీధుల్లో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులను, టమోటా వ్యాపారస్తులను ప్రతి నిత్యం రూ.500ల నుంచి రూ.1500 వరకు చలానాల రూపంలో కార్పొరేషన్‌కు చెందిన అధికారులు వసూళ్లకు పాల్పడుతూ వేధింపులకు గురిచేయడం సరికాదని 17వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 17వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌కె నజీర్ ఆధ్వర్యంలో అనేక మంది చిరువ్యాపా రస్తులు, టమోటా వ్యాపారస్తులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌కె నజీర్ మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ పి.సుధాకర్ తన సొంత లాభం కోసం గడిచిన 10 సంవత్సరాలుగా చిరువ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తున్న వారిపైకి అధికారులను ఉసిగొల్పి బెదిరింపు చర్యలకు పాల్పడి చలనాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నాయకులు కట్టా సతీష్‌కుమార్ మాట్లాడారు. చిరువ్యాపారాలు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటూ, తమ బిడ్డలను చదివించుకుంటున్న వారి స్థితిగతులను జిల్లా అధికారులు పరిశీలించి అధికారుల వేధింపుల నుంచి విముక్తి కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు చిరువ్యాపారస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కట్టా సతీష్‌కుమార్

ఫొటోగ్రఫీలో హెచ్‌ఎంకు అవార్డు

ప్రజాశక్తి - లింగసముద్రం: 132 వ ప్రపంచ పిక్టోరియాల్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున యునివర్సిటీ వారు ఇండియన్ ఇంటర్నెషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్ మరియు ఫోటోగ్రఫీ అకాడమి ఆప్ ఇండియా సంయుక్తంగా నవంబర్ 2024లో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొగిలిచెర్ల ప్రధానోపాధ్యాయులు కె.సూర్య ప్రకాశరావు అద్భుత ప్రతిభ కనబరిచారు.సూర్య ప్రకాష్ రావు ఫొటోగ్రఫీలో ప్రతిభను గుర్తించి బంగారు పతకం,ప్రముఖ ఛాయాచిత్రకారిణి లేటు చిత్రాంగడ శర్మ మెమోరియల్ అవార్డు నగదు బహుమతి లభించింది.ఈ అవార్డును ఆచార్య నాగార్జున యునివర్సిటీ గుంటూరులో నవంబర్ 30న జరిగిన అవార్డు ఫంక్షన్ లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆప్ హైయర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ కె.రామ మోహనరావు చేతులమీదగా అందుకున్నారు.కార్యక్రమంలో ఏఎన్ యు వైస్ కౌన్సిలర్ ప్రొఫెసర్ కె.గంగాధర రావు ,ఏఎన్ యుకాలేజ్ ఆప్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్,హెడ్ డిపార్ట్మెంట్ ఆప్ జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ డా.జే.మధుబాబు, ఐఐపీసీ డిజిటల్,ఫొటో జర్నలిజం విభాగం చైర్మన్ తమ్మా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పలువురు మిత్రులు, ఉపాద్యాయులు సూర్య ప్రకాశ రావును అభినందించారు.



అవార్డు అందుకుంటున్న సూర్యప్రకాశరావు

ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ జర్నల్‌లో 'ప్రకాశం' ఆర్టికల్ ప్రచురణ

ప్రజాశక్తి-కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు,విద్యార్థులు సంయుక్తంగా రూపొందించిన సాంకేతిక విశ్లేషణ పత్రం ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ జర్నల్ లో ప్రచురణ కావటం తమ కాలేజీ సమర్ధతకు తార్కాణమని సాంకేతిక డైరెక్టర్ డాక్టర్ కే.విజయ్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కాలేజీ పరిశోధన విభాగ డీన్ డాక్టర్ లక్ష్మణ రావు నేతత్వంలో రూపొందించిన ఈ పత్రంలో ఈ.ఈ.ఈ విభాగం ఎస్.ఎన్. మీరావలి, విద్యార్థులు కే.మౌనిషా, కే.వెంకటేష్ లు సహకరించారని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు. పరిశోధనాత్మక విద్య వైపు విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ఇద్దరు విద్యార్థులను పత్ర విశ్లేషణలో భాగస్వాములను చేశామన్నారు. అంతర్జాతీయ స్థాయి జర్నల్ తమ కాలేజీ పేపర్ ప్రచురణ కావడం హర్షనీయమని పలువురు అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. ఇతర విభాగ అధ్యాపకులు కూడా దీన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులను మోటివేట్ చేస్తామని తెలిపారు.

డాక్టర్ విజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు :ఆంధ్రప్రదేశ్ మాల సంక్షేమ కో – ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తాడేపల్లిలోని మాల కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా సోమవారం కలిసి శాలువాతో సత్కరించి అంబేద్కర్ ప్రతిమను అందించిన అనంతరం శుభాకాంక్షలు తెలియజేసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తెలిపారు. కార్పొరేషన్ ద్వారా పేదప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు మంచిపేరు తీసుకొని వచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీచేయాలని వెల్లడించారు. స్పందించిన చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలు అందించెందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారని మోషే తెలియజేశారు.చైర్మన్ ను కలిసిన వారిలో బిల్లా గ్రూప్ ఆఫ్ బిజినెస్ అధ్యక్షులు సాయి కృష్ణ నాయుడు , రావినూతల వెంకటేష్ తదితరులు ఉన్నారు.



కందుకూరు అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు నియోజకవర్గ మండల అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం ఓవీ రోడ్లోని విజేత కన్స్ట్రక్షన్ ఆఫీసులో మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షులు దివి శివరామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. కందుకూరు పట్టణ,నియోజ కవర్గస్థాయిలో పలు అంశాలపై అభివృద్ధి మండల సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ అంశాలను వివరించుటకు రేపు ఉదయం 11 గంటలకు కందుకూరు రిటైర్డ్ ఎంప్లాయీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తామన్నారు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి సమావేశంలో కార్యదర్శి నేతి మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి బొక్క వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బూసి సురేషు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, గౌరవ సభ్యులు తోకల వెంకటేశ్వర్లు,రేణమాల అయ్యన్న, పులిచెర్ల వెంకట సుబ్బారెడ్డి,చింతర బోయిన నరేష్, అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

కలెక్టరేట్ ఎదుట వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం


ప్రజాశక్తి-నెల్లూరు: నెల్లూరు జిల్లా మనుబోలు మండలం, వీరంపల్లి గ్రామానికి చెందిన తుమ్మల హైమావతి వృద్ధురాలు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కనప్రాంగణం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి సమాచారం మేరకు..వృద్ధురాలు చేస్తున్న ఆత్మహత్యాయత్నాన్ని ముందుగానే పసిగట్టిన సెక్యూర్టీగార్డు పెట్రోల్ బాటిల్‌ను లాక్కొన్నాడు. తన పొలాన్ని తమ గ్రామానికి చెందిన గోనుపల్లి ప్రభాకర్ అనే వ్యక్తి 2014 నుంచి ఆక్రమించుకొని తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, అతనిపై అధికారులు విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో తనకు ఆత్మహత్య శరణమంటూ కన్నీటిపర్యంతమైంది. తన భర్త పొలం పనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వేరే వారికి తమకు చెందిన పొలం (3 ఎకరాల 31 సెంట్లు) రూ.3 లక్షలకు తాకట్టు పెట్టామని, వారు సాగుబడి చేసుకుంటుండగా గోనుపల్లి ప్రభాకర్ అనే వ్యక్తి వారిని బెదిరించి ఊరు నుంచి వెళ్లిపోయే పరిస్థితి కల్పించారని వాపోయింది. తమ పొలం తాకట్టు పెట్టుకున్న వారు ఊరు వదలి వెళ్లి పోవడంతో పొలాన్ని గోనుపల్లి ప్రభాకర్ అనే వ్యక్తి ఆక్రమించుకొని సాగుబడి చేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటికే పలు మార్లు తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా అధికారులకు వివరించి ఫిర్యాదు చేశాను. చివరకు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ దృష్టికి సైతం తీసుకెళ్లాను. వివాదంలోని భూమిని సాగుబడి చేయరాదని ఎస్‌ఐ చెప్పినా లెక్కచేయకుండా గోనుపల్లి ప్రభాకర్ పొలం దున్ని పనులు ప్రారంభించాడు. తన పొలానికి సంబంధించిన పాస్ పుస్తకాలు, పట్టా కాగితాలు అన్ని ఉన్నా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే విచారణ చేసేందుకు రెండు నెలలు గడువు కావాలని చెప్పారు. ఈ రెండు నెలల్లో పొలం దున్ని పంట సాగుబడి చేసుకొని ఈ భూమి నాదే అని అనిపించుకుంటాడంటూ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

బాధ్యతారాహిత్యంగా ప్రవరిస్తే సహించను

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:

విధి నిర్వహణలో ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. కూనిపాలెం పంచాయతీ కార్యదర్శి స్టాలిన్ సమీక్షా సమావేశానికి ఆలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జీ ఎంపీడీఓ కె నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థికసంఘం నిధులు వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తరువాత అనేక అబివది, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు, అలాగే మండల గ్రాంట్ కూడ మంజూరయినట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరయిన నిధులతో గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పలు శాఖల అదికారులు పంచాయతీల్లో మౌళిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని హితబోధ చేశారు. గ్రామస్థాయిలోని నాయకులను సమన్వయం చేసుకొని అభివద్ధి వైపు అడుగులు వేయాలనిసూచించారు. గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలను సత్వరమే పరష్కరించాలని చెప్పారు.. అధికారులు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో కలిసిమెలిసి పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి ముందుగా ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇఇ ఎస్ శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, టీడీపీ నాయకులు కాకుమాని హర్ష, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి వలేటి నరసింహం, వలేటి నరసింహం సొసైటీ, వలేటి మధు, కొంకా రమేష్, శామీరపాలెం సర్పంచ్ నవులూరి రాజా రమేష్, ఘట్టమనేని సుబ్బారావు, కూడల భాస్కరరావు, శనివారపు మాల్యాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

నేత్రదానం

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణానికి చెందిన ముప్వల ప్రసాద్ భార్య భువనేశ్వరి ఆదివారం రాత్రి అనారోగ్యం తో మరణించారు. ఆమె భర్త ప్రసాద్ తన అన్న ముప్వల భూషయ్య, కుమారుడు శ్రీనివాసులు ప్రోత్సాహంతో భువనేశ్వరి రెండు నేత్రాలు దానం చేశారు. నెల్లూరు మోడరన్ కంటి ఆసుపత్రి రీసెర్చ్ సెంటర్ వైద్య సిబ్బంది నేత్రలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సేవకుడు చన్నా వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ నేత్రదానం చాలా సులభమైన ప్రక్రియ. ఇందులో దాత కళ్లలోని పలుచని పారదర్శకమైన కార్నియా పొర మాత్రమే సేకరిస్తారు. అభివృద్ధి చెందిన వైద్య శాస్త్రం వలన ఒకరి మరణానంతర నేత్ర దానం తో నలుగురు అంధులకు చూపును ప్రసాదించవచ్చు అని అన్నారు.కార్యక్రమం లో దాత కుమార్తె సుజాత, అల్లుడు వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి

చట్టపరంగా న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుంచి స్వీకరించిన వినతులపై స్పష్టమైన విచారణ చేపట్టి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్‌పి జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 78 ఫిర్యాదులు స్వీకరించామని ఎస్‌పి మీడియాకు తెలియజేశారు. బాధితుల నుంచి స్వీకరించిన వినతుల్లో కొన్నింటికి సంబంధించిన వివరాలు తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, డిటిసి, డిఎస్‌పి గిరిధర్, లీగల్ అడ్వయిజర్ శ్రీనివాసులు రెడ్డి,ఎస్‌బి-1,2 సిఐ , కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్: మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొలం పనులకు వెళ్లిన రైతులు కూలీలు కరెంటు స్తంభాలు, తీగలు గమనించుకొని ఉండాలని సిపిఎం మండల కన్వీనర్ జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్లూరు మండల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి-కందుకూరు :దేశంలో నరేంద్ర మోడీ నేతత్వంలో పెరిగిపోతున్న హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా దళిత,ప్రజా సంఘాల నాయకులు ఐక్యంగా పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యూ) రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి. ప్రదీప్ అన్నారు.పీడీఎస్ యూ ఏర్పడి 50ఏళ్లపూర్తయిన సందర్భంగా సోమవారం కందుకూరు పట్టణంలో జరిగిన ప్రకాశం, నెల్లూరు జిల్లాల ప్రస్తుత, పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనానికి ఆయన ముఖ్యగా అతిథిగా విచ్చేసి మాట్లాడారు.. ప్రదీప్ మాట్లాడుతూ అనేకమంది విలువైన విద్యార్థుల రక్త తర్పణాలతో పిడిఎస్‌యు ఏర్పడిందన్నారు.కార్యక్రమంలో టి పోతురాజు, ఏసుదాసు, జగన్, గేరా చిరంజీవి, బ్రహ్మయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాగర్, ఎం. వినోద్ కుమార్, ఎం సునీల్, ఎస్కే జులైద్ బాషా, మహర్షి ప్రసన్న పాల్గొన్నారు.

నుడా అంతా అవినీతి మయం..!

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆనం


ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి నుడా, కార్పొరేషన్‌లో కొందరు అధికారులు అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ఒ. ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్పొరేషన్‌లో మార్టిగేజ్ కుంభకోణం జరిగిందని, గతంలో ఆధారాలతో నిరూపించానన్నారు. అధికారులకు, మంత్రులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. అందుకే హై కోర్టును ఆశ్రయించానన్నారు. తాజాగా నుడా పరిధిలోనూ అడ్డదిడ్డంగా అనుమతులు ఇస్తున్నారన్నారు. ఆక్వాఫైనాన్స్ సర్టిఫికెట్ ఇచ్చి, అనుమతులు ఇస్తున్నారన్నారు. నెల్లూరు నగరంలోని గౌతమి నగర్‌లో ఎస్‌ఎస్ బిల్డర్‌కు అక్రమంగా అనుమతులు ఇచ్చారన్నారు. ఎక్కడా నుడా నిబంధనలు పాటించకపోయినా ఎలా అనుమతులు ఇచ్చారన్నారు. అక్కడ పనిచేసే సుబ్బారావు ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నుడా పరిధిలో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలం అక్రమించి, లేఅవుట్ వస్తే, దానికి నుడా అనుమతులు ఇచ్చిందన్నారు. అనేక ఆధారాలు తన వద్దనున్నాయన్నారు. లోకాయుక్త పరిధిలోని కేసులకు అనుమతులు ఇచ్చారన్నారు. మంత్రి నారాయణకు తెలియకుండా కొందరు అదికారులు ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ నుడా చైర్మన్ 13 కేసులు లోకాయుక్తలో ఉంటే వాటికి అనుమతులు ఇచ్చారని విమర్శి ంచారు. పది రోజులు సమయం ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరికొన్ని ఆధారాలు బయటపెడుతానన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న 'ఆనం'

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను ఎక్కడా జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 212 అర్జీలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 212 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 95, మున్సిపల్‌శాఖకు సంబంధించి 23, సర్వేకు 13, పంచాయతీరాజ్‌శాఖకు 11, సివిల్ సప్లయిస్‌కు 11, ఇరిగేషన్‌కు 10, పోలీసుకు 6, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 5 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో తుపాను నష్టాల నివేదికలను అందించండి : కలెక్టర్

జిల్లాలో మూడ్రోజులుగా ఫెయింజల్ తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసినందున, జరిగిన నష్టాలను పూర్తిస్థాయిలో అంచనావేసి నివేదికలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. భారీ వర్షాల నష్టాలపై కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల వలన దెబ్బతిన్న ఇళ్లు, పంట నష్టం, ధ్వంసమైన రోడ్లు తదితర నష్టం వివరాలను ఆయాశాఖల వారీగా నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజా కుమారి, జిల్లావ్యవసాయ అధికారి సత్యవాణి, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఇ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నా భూమిని ఇప్పించండి సారూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

తన భూమి ఆక్రమణకు గురైందని, అధికారులు చొరవ చూపి ఆ భూమిని ఇప్పించాలని కోరుతూ మండలంలోని అక్బరాబాద్ గ్రామ కాపురస్తురాలు పరిటాల పద్మ అనే మహిళ గ్రీవెన్స్ సందర్భంగా తహశీల్దారుకు అర్జీ సమర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన మామ పరిటాల మురహరి తండ్రి వెంకట నరసయ్యకు సంబంధించిన 2.84 సెంట్లు ప్రభుత్వ భూమిని ఇటీవల దాసిరెడ్డి నాగిరెడ్డి అనే ఆయన ఆక్రమించుకొన్నాడని తెలిపింది. ఇదేమిటని అడగ్గా.. మీ మామ దగ్గర మేము రూ.10వేలు ఇచ్చి తీసుకున్నామని, ఈ పొలం నాది అని ఎలా మీరు మా పొలంలోకి వస్తారని, దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ భూమి తన మామ పేరుపై ఉందని, ఇటీవల రీసర్వే ద్వారా ఆ భూమిని రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ భూమిగా క్రియేట్ చేశాడని తెలియజేశారు. గతంలో పనిచేసిన తహశీల్దారు కూడా ఆ భూమిలో మీరు ఏ పంట వేయకూడదని అతనికి చెప్పినా, మళ్లీ ఇప్పుడు ఆ పొలంలో వరినాట్లు వేయడానికి సిద్ధపడుతున్నాడని, అతని పేరుతో లేని భూమిలో ఎలా నాట్లు వేస్తారని ప్రశ్నించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతసాగరం : బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మావతి ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల చేశారు. అనంతరం ఎస్‌టి కాలనీలో బాల్య వివాహాలపై ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండానే వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని పెళ్లి చేసిన తల్లిదండ్రులు, పెళ్లికి సంబంధించిన పెద్దలు నేరస్తులుగా పరిగణించి శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. ఎవరూ కూడా బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, సోమశిల సెంటర్ అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్టాండింగ్ టేబుల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సాంబశివ ఛారిటబుల్ ట్రస్టు అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో ప్రజలు తినేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేలా స్టాండింగ్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. సాంబశివ ఛారిటబుల్ ట్రస్టు, తెలుగుభారతి సేవా సమితి ఆత్మీయ కార్యాచరణ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వేలాదిమంది రోగులు, వారి బంధువులు, చిన్నారులు ప్లేట్లు పట్టుకుని తినే సమయంలో ఇబ్బందులు పడుతున్నట్లు గమనించి స్టాండింగ్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. అన్నదానం చేయడమే కాక ఎవరూ ఇబ్బందులు పడకుండా అన్నం తినేలా టేబుల్స్ ఏర్పాటు చేసిన పరమేశ్వరరెడ్డికి పలువురు ధన్యవాదాలు తెలియజేశారు.

గడియారం వితరణ



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఖాదర్‌పూర్ గ్రామ వాసి దివంగత పోస్ట్‌మాస్టర్ రామాయణం శ్రీకాంత్ జ్ఞాపకార్థం వారి తనయుడు అన్వేష్ పాఠశాల ఛైర్మన్ హరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గోడగడియారంను అందజేశారు. అలాగే గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామన్నారు. పాఠశాలకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రమణయ్యకు ఎంఎల్ఎ కాకర్ల సంతాపం

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన కండే రమణయ్యకు ఎంఎల్ఎ కాకర్ల సురేష్ సంతాపం వ్యక్తం చేశారు. టిడిపి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే కండే రమణయ్య మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబానికి అండగా ఉంటానని తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విడవలూరు : తహశీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ముదుగుర్తి గ్రామం పెన్నానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం గ్రామ గ్రామంలోని ప్రజలందరూ దండోరా రూపంలో తెలియజేశారు. సోమశిల డ్యామ్ నుంచి పెన్నా నదికి నీరు వదులుతున్న సందర్భంగా పశువుల కాపదారులు గొర్రెల కాపులుదారులు పెన్నానది పరిసర ప్రాంతాలకు పోకుండా గ్రామ ప్రజలుతగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ప్రజాశక్తి-కావలి : కావలి ఒకటో పట్టణం పోలీస్ కానిస్టేబుల్ షేక్.బాబుల్-రమీజా దంపతుల కుమార్తె చిన్నారి షేక్.సాఫియా 7వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని భవిత కేంద్రంలో ఉన్న మానసిక దివ్యాంగులకు దుప్పట్లు వితరణ చేశారు. మరోదాత ప్రవాస భారతీయులు స్వర్ణ అనూష మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె భర్త స్వర్ణ తిరుపతి స్వామి, కుమార్తె చిన్నారి ధన్యశ్రీ స్వర్ణ సహకారంతో బుధవారం కాలనీలో 100 మంది పేదలకు ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ సభ్యులు, విశ్రాంత బిసి హాస్టల్ వార్డెన్ షేక్.ఖాదర్ బాషా, దాతలు షేక్.బాబుల్ - రమీజ దంపతులు, వారి కుమార్తెలు, సంస్థ అధ్యక్షులు సురేంద్ర, ఉపాధ్యాయులు మమత, లక్ష్మి పాల్గొని దుప్పట్లు వితరణ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని జాతీయ రహదారిలో ఉన్న సాయిబాబా గుడి సమీపంలో అండర్ బ్రిడ్జి వద్ద సుమారు (50) వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడని పోలీసులు తెలిపారు. జీన్స్ పొట్టా ధరించి ఉన్నాడని, ఎవరైనా ఇతని ఆచూకీ తెలిస్తే కోవూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలియజేశారు.

4నుంచి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కావలి : ఎపి నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో కావలి విక్రమ సింహపురి యూనివర్శిటీ పీజీ కాలేజీలో డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సు 4వ తేదీ నుండి ఏటువంటి ప్రవేశ రుసుము లేకుండా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ తెలిపారు.. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నారు. ఈ శిక్షణ కాలం పరిమిత కాలం నెలలు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం ఫోన్ 6301543185 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని రామన్నపాలెం గ్రామంలో నేత మునిగిన వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శివ జ్యోతి మాట్లాడారు. ఎఎస్ఆర్ సైంటిస్ట్ సుజాత, మధు సూదన్, కోవూరు ఎడిఎ డి సుజాత, ఎంఎఒ ఎస్.హెచ్.ఎస్ లక్ష్మి, ఏఈఓ నిహారిక పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని చాకిచర్ల గ్రామంలో నీట మునిగిన వరి పొలాలను సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు పి.అనసూయ, కందుకూరు కె.వి.కె సైంటిస్ట్ వెంకటేష్, నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారిని తిరుమల జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలం నందలి ఫెంగల్ తుఫాను వర్షాలకి ప్రభావితమైన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. వారి వెంట కృషి విజ్ఞాన కేంద్రం ఐ. వెంకటేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు పి. అనసూయ ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు జి. వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని ఓగూరు, మహాదేవపురం, పలుకూరు, గ్రామాలలో ఫెంగల్ తుఫాను ప్రభావం వలన దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పి.అనసూయ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఈ వెంకటేష్ సోమవారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేష్, మాధు గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శరత్‌కుమార్, షేక్.నజీర్, ఐ.బ్రాహ్మణి, ఐ.రమణయ్య ప్రకృతి వ్యవసాయ అధికారి పి.మాధవ పాల్గొన్నారు.

చెరువులకు నీటి పరవళ్లు..

- కందుకూరు సబ్ డివిజన్‌లో భారీ వర్షం

ప్రజాశక్తి-కందుకూరు : జలవనరుల శాఖ కందుకూరు సబ్ డివిజన్‌లో భారీ వర్షం కురిసింది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో ఆదివారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకు కురిసింది. ఆత్మకూరు గుడ్లూరు మండలంలో 122.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలో 90 మిల్లీమీటర్ల ఉలవపాడు మండలంలో 86 మిల్లీమీటర్ల వర్షం కురిసింది లింగసముద్రం మండలంలో 90.2 మిల్లీమీటర్లు, ఉలవపాడు మండలంలో 86.4 మిల్లీమీటర్ల, కందుకూరు మండలంలో 54.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఒక్క రాత్రిలో భారీ వర్షం కొరవడంతో వాగులు, వంకలు, ఎర్రలో నీటి ప్రవాహం ఉపయోదుంది. కందుకూరు సబ్ డివిజన్‌లో ఉన్న 6 వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుంది.

జిఒ 73ను వెంటనే అమలు చేయాలి

పలుచోట్ల సిపిఎం, వ్య.కా.సం. ఆధ్వర్యంలో నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు అందజేత



అనంతసాగరంలో..

ప్రజాశక్తి-అనంతసాగరం : వ్యవసాయ సీజన్‌లో పనిచేసే వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబర్ 73 అమలు చేయాలని కోరుతూ సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే రైతులకు ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. వ్యవసాయ రంగంలో రైతులు, వ్యవసాయ కార్మికులు నష్టపోతూ మధ్య దళారులు లాభాలు పొందుతున్నారన్నారు. వ్యవసాయం రంగంలో యంత్రాల వాడకం పెరగడం, పంట సాగులో మార్పులు రావడం వల్ల పనులు లేక వ్యవసాయ కార్మికులు అల్లాడుతున్నారన్నారు. గ్రామాలలో ఉండే వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ రంగంలో సంవత్సరానికి 30 రోజులు కూడా పనులు దొరకడం లేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించాలని వారి జీవితాలు మెరుగు పర్చడం కోసం కార్మిక శాఖ వ్యవసాయ కార్మికులకు కనీస కూలీ కోసం ఇచ్చిన జిఒ నెంబర్ 73ను గ్రామాల్లో మండల అధికారులు అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ జిఒ ప్రకారం ఆరు గంటలు పనిచేసిన వ్యవసాయ కార్మికులకు రూ.443 కూలీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, అనంతసాగరం కార్యదర్శి జక్రయ్య, మండల కమిటీ సభ్యులు కానగల శ్రీనివాసులు, సిఐటియు మండల అధ్యక్షులు మీరామొహిద్దీన్, నాగులూరు వెంకటేష్, అంకయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్‌లో...

ప్రజాశక్తి-నెల్లూరు : వ్యవసాయ కార్మికులకు కూలి పెంచే జీఓ నెంబర్ 73 అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు కనీసం వేతనం వచ్చే లా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో వ్యకాసం నాయ కులు శ్రీపతి వెంకయ్య, పాదర్తి మస్తానయ్య, దారా శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ సీజన్లో కూలీ పెంపు కోసం జీఓ నెంబర్ 73 అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల తహశీల్దార్‌కు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. పచ్చా మధు, వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ, బండి శౌరి, ఉంద్రాళ్ల శీనయ్య, ఇనమాల కొండయ్య పాల్గొన్నారు.




ప్రజాశక్తి-కోవూరు : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ధర్నా ఉద్దేశించి మండల కార్యదర్శి బట్టా పెద్దబ్బయ్య మాట్లాడుతూ జిఒను ఉద్దేశాన్ని మండలంలోని కార్మికులకు రైతులకు తెలియజేసి వ్యవసాయ కూలీలకు కనీస వేతనం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్య.కా.స. మండల అధ్యక్షుల విజయ్ కుమార్, బుజ్జయ్య, శేషయ్య, సురేష్, గోవర్ధన్, మల్లికార్జునరెడ్డి, యు.వి.రమణయ్య, కాలేషా, లీలమ్మ, రత్తమ్మ, హరి, శీనయ్య, ప్రసాద్, చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-గుడ్లూరు : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుమేరకు ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు దామ కృష్ణయ్య, పాలకీర్తి నాగేశ్వరరావు, పూసల పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : వ్యవసాయ కార్మికుల కోసం గతంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 73ను అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం లోని తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తంబి రమణయ్య, వ్యకాసం కార్యదర్శి తాటిపోయిన మస్తానయ్య, అధ్యక్షులు, సిపిఎం నాయకులు గండవరపు శ్రీనివాసులు, రఘురామయ్య, పోతంశెట్టి శ్రీనివాసులు, తదితరులున్నారు.





ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వ్యవసాయ సీజన్‌లో పనిచేసే వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వ ఇచ్చిన జిఒ 73 అమలు చేయాలని కోరుతూ జిల్లా కౌలు రైతుసంఘం నాయ కులు గంటా లక్ష్మీపతి ఆధ్వర్యంలో సోమ వారం ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ పావనికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యకాసం కార్యదర్శి పోలిపోగు వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు గొర్రెపర్తి పెంచలయ్య, రైతు సంఘం నాయకులు తోడేటి రాము, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-వలేటివారిపాలెం : వ్యవసాయ సీజన్‌లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వ ఇచ్చిన జిఒ 73 అమలు చేయాలని కోరుతూ వ్యకాసం నాయకులు డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దార్ల మాధవరావు, జివివి కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి వాటికి లైన్లు ఏర్పాటు చేయలేదని, దాంతో వీధి దీపాలు సైతం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ కనెక్షన్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. వార్డు పరిధిలోని టెక్కె పఠాన్ మస్తాన్ సా ఇంటి వద్ద నుండి షేక్ సంధాని ఇంటి వరకు మూడు విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసి ఉన్నారన్నారు. ఇప్పటి వరకు వాటికి విద్యుత్ వైర్లు బిగించలేదని, దాంతో వీధిలైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. స్థానికులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 17వ వార్డు స్థానికులు ఉన్నారు.



రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ శివారు ప్రాంతాలైన బిసి, కావలి కాలనీ ప్రాంతాలకు రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కాలనీవాసులు తహశీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవాలంటే సుమారు రూ. 100 ఒక్కొక్కరికి ఆటో ఖర్చులకు అవుతుందన్నారు. ఎక్కువమంది రోజువారి కూలీలు ఉండడంతో పంపిణీ చేస్తే రేషన్ తెచ్చుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎక్కువగా వృద్ధులు, చిన్నారులు ఇంటిదగ్గర ఉండడం మరింత బాధాకరమని తహశీల్దార్‌కు తమ బాధలను విన్నవించారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికా రులు కూడా స్పందించి రెండు కాలనీలకు అనువైన ప్రాంతంలో రేషన్‌షాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

పెన్నానదిలో చిక్కుకున్న వారిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-కోవూరు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పెన్నానదిలో వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తున్నందున సోమవారం జమ్మిపాలెం వద్ద పెన్నా నదిలోనికి 6 వ్యక్తులు వెళ్లి నీటిలో చిక్కుకుని పోవడంతో స్థానికులు కోవూరు పోలీస్ వారికి సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన కోవూరు సిఐ వి.సుధాకర్ రెడ్డి, ఎస్ఐ వై.రంగనాథ్ గౌడ్ వారి సిబ్బందితో అక్కడకి చేరుకుని వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చివారితో కలసి నీటిలో చిక్కుకున్న వారిని కాపాడారు. జమ్మిపాలెం గ్రామానికి చెందిన మదపల్లి నవీన్, చల్లకొలుసు కామమ్మ, చలంశెట్టి పోలయ్య, కత్తి గోవింద్, కత్తి గణేష్, కత్తి వెంకట రమణయ్య అనే వ్యక్తులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న నెల్లూరు రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాస్, కోవూరు సిఐ, ఎస్ఐను వారి సిబ్బందిని అభినందించారు.



విజయకుమార్‌ను కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి-ఉదయగిరి : రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డ్ చైర్మన్ నీలయపాలెం. విజయ కుమార్‌ను రాష్ట్ర స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సోమవారం గుంటూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎన్‌జిఒలందరూ ముఖ్యమంత్రి ఆదేశాల మేర స్వచ్ఛభారత్, స్వచ్ఛ సేవ, ప్రకృతి వ్యవసాయం, అటవీ రక్షణ, బిఎంసిలను బలవపత్రం చేసే, కార్యక్రమాలలో పాల్గొని ప్రభుత్వానికి, మంచిపేరు తేవాలని తెలిపారు. అలాగే మెంబర్ సెక్రెటరీ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్‌జిఒలు బిఎంసిలకు జిఒ విద్య కమిటీలకు రావాల్సిన షేరింగ్ బెనెఫిట్‌ను వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య అధ్యక్షులు పివి రమణయ్య, సెక్రటరీ ప్రకాష్ అడ్మిన్ పి ఎస్ మూర్తి, గాలిబ్, రాముడు రాజారావు, సింహాద్రి, ప్రసాదం, తులసి, నాగరాణి, మధుసూదన్ రావు, చంద్రారెడ్డి, మాన్సింగ్, రామకృష్ణ, రాధా పాల్గొన్నారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



పింఛన్ అందజేస్తున్న విఆర్ఓ

మండలంలోని అప్పారావుపాలెం గ్రామానికి చెందిన షేక్.హనీఫ్ గత 10 రోజుల నుండి అనారోగ్యం బారినపడి నెల్లూరులోని నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విఆర్ఓ వెంకటేశ్వర్లు శనివారం రోజు గ్రామంలో పింఛన్‌ను లబ్ధిదారులందరికీ అందజేశారు. ఒక వ్యక్తి మిగిలి ఉండగా.. ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నాడని ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఆయన లబ్ధిదారుడి స్వగ్రామం నుండి నారాయణ ఆసుపత్రి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో షేక్ హనీఫ్ చికిత్స పొందుతున్నాడు. విఆర్ఓ జోరువానలో ఆదివారం అక్కడికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న హనీఫ్ విఆర్ఓకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహాసేన రాజేష్ వ్యాఖ్యలపై ఖండన

ప్రజాశక్తి-కావలి

మంద కృష్ణ మాదిగను విమర్శిస్తూ మహాసేన రాజేష్ తన స్థాయిని మరిచి చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నట్లు ఆల్ ఇండియా బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దావులూరు శ్యామ్‌సన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బహుజన సంఘం నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మంద కృష్ణ మాదిగను దూషించి, మాదిగలను పిల్లలను విమర్శించిన మహాసేన రాజేష్ మాటలను ఆయన ఖండించారు. గతమంతా రాజేష్‌ను ఏమో అనుకున్నాం కానీ అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనస్థాయికి తగిన పదాలే మాట్లాడాలి గానీ మంద కృష్ణ గురించి మాట్లాడే అర్హత తనకు లేదని తెలుసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా 58 కులాలను తన భుజాన వేసుకుని స్వార్థం లేకుండా ముందుకు నడిపిస్తున్న మంద కృష్ణపై అనవసరపు విమర్శలు తగవన్నారు. ఎస్‌సి కులాలను అడ్డం పెట్టుకుని కొంతకాలం అధికారంలో ఉన్న పార్టీని, మరికొంత కాలం ఇంకో పార్టీ నాయకులను దూషిస్తూ కాలాన్ని గడుపుకునే ఆయన స్థాయి ఎక్కడుండో తెలుసుకోవాలన్నారు. మంద కృష్ణను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని అఖిల భారత బహుజన సంఘం, ఎపి రాష్ట్ర అధ్యక్షుడు దావులూరి సాంసన్, అఖిల భారత బహుజన సంఘం జిల్లా కార్యదర్శి నలగట్ల జార్జ్, పరుసు రమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

తుపాన్ బాధితులను ఆదుకోండి..

ప్రజాశక్తి-కావలి



ఆర్‌డిఒకు వినతినిస్తున్న ఎస్.మల్లి

బడుగువర్గాల తుపాన్ బాధితులను ఆదుకోవాలని దళిత సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి, ఆర్‌డిఒ సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో కావలి డివిజన్‌లో విడవలూరు వద్ద నుండి, కావలిరూరల్ మండలం వరకు అనేక ఎస్.సి., ఎస్.టి. కాలనీల్లో నీరుచేరి తీర ప్రాంతంలో పది రోజుల నుండి నరక యాతన పడ్డారని తెలిపారు. స్థానిక అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కనీసం ప్రజలను పలకరించ లేదన్నారు. ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. కేవలం బడుగు వర్గాలు రూ.500 ఇస్తే ఓట్లు వేస్తారని మాట్లాడుతున్నారని తెలిపారు. తుపాన్‌లో అల్లూరు మండలంలోని గోగులపల్లి గ్రామంలో పొలాల మధ్య ఉన్న వారిని కనీసం పరామర్శించి ఆహారం అందించలేద న్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల లోపం ఇక్కడ కనిపిస్తుందన్నారు. విడవలూరు మండలంలో ఊటుకూరులో యానాదులు నీటిలో ఉన్నారని తెలిపారు. కాబట్టి నీరు చేరిన కాలనీలలో 25 కేజీల బియ్యం, రూ.5వేల నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తుపాన్ బాధితులందరికీ వరద సాయం అందించాలని, ఇప్పటికే 10రోజుల నుండి ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఎంతో నష్టపోయి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సాదు ప్రసాద్, చెరుకూరి జనార్ధన్, ఆత్మకూరి మోహన్‌రావు, తిరుపతి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

- విలపిస్తున్న బాధితురాలు రవణమ్మ

ప్రజాశక్తి-వరికుంటపాడు



వరికుంటపాడు కు చెందిన దాసరి రవణమ్మకు చిన్న వయసులోనే తన భర్త దాసరి మాల్యాద్రి అనారోగ్యంతో మరణించడంతో ఆమె తన కుటుంబ పోషణకై బర్రెలను మేపుకుంటూ, వాటి ద్వారా ఉపాధి పొందుతుంది. రోజులాగే మేతకు వెళ్లిన బర్రెల మందలో ఒకటి ఎంతసేపటికి ఇంటికి తిరిగి రాకపోవడంతో, ఊరంతా గాలించిన ఆమె చివరికి రామాలయం పక్కనే ఉన్న, ట్రాన్స్ ఫార్మర్ దగ్గర విగతజీవిగా పడి ఉన్న తన బర్రెను చూసి బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.

మా భూమి ఇప్పించండి సారూ..



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం అక్కరా వారి కండ్రిక గ్రామంలో కబ్జాకు గురైన భూమిని తమకు ఇప్పించాలని అక్కరాజువారి గ్రామస్తులు కోరారు. కబ్జాకు గురైన భూములపై సోమవారం తహశీల్దార్ సురేష్ బాబుకు ఆ గ్రామస్తులు మాజీ మండల అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోగోలు మండలం అక్కరాజువారి కండ్రిక గ్రామంలోని సర్వే నెంబరు 257, 260 ఫారెస్ట్ భూమి, మేత పోరంబోకు భూమి 125 ఎకరాలు ఉండని తెలిపారు. అటవీ శాఖ వారు 1990 సంవత్సరంలో కొంత భాగంలో చెట్లు నాటి కొంత తెలుగు గంగ కాలువ నిమిత్తం కొంత భాగాన్ని ఖాళీగా ఉంచగా ఆ భూమిని కొంతమంది కబ్జా రాయుళ్లు ఆక్రమించి అప్పటి తహశీల్దార్‌తో కలిసి వన్‌బి అడంగల్ ఎక్కించుకొని పాస్‌బుక్‌లను పొందారని, ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లగా విచారణ చేపట్టి అప్పటి తహశీల్దారును సస్పెండ్ చేశారని తెలిపారు. గ్రామంలో రైతులకు పశువులకు మేత లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కబ్జా రాయుళ్ల పాస్ పుస్తకాలను, వన్‌బి అడంగల్‌ను రద్దు చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



ప్రజాశక్తి-కావలి : మద్దూరుపాడులో ఉన్న డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్లో 2వ రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ (అండర్ -12) బాల బాలికల ఛాంపియన్ షిప్ రగ్బీ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సుధీర్ నాయుడు మాట్లాడుతూ పోటీల నిర్వహణకు తమ కళాశాల యాజమాన్యం సహకరిస్తుందన్నారు. సీనియర్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు వేదిక ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు కప్పులు, పతకాలు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. బాలుర విభాగంలో కర్నూలు, సత్యసాయి, నెల్లూరు జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలిపొందాయన్నారు. అలాగే బాలికల విభాగంలో కర్నూలు, సత్యసాయి, కృష్ణాజిల్లా జట్లు మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో విజయం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ, డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ మురళి, భోజన దాత జి.శ్రీను చక్కటి ఏర్పాట్లు చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-వరికుంటపాడు


వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో మద్దినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరికుంటపాడు మండలంలోని వరికుంటపాడు, కనియంపాడు బొగ్గుబట్టీల వద్ద పనిచేసే కూలీలకు, ఆంధ్రావారిపల్లి, బోయమడుగుల ఎస్‌టి కాలనీలలో పేదలకు ట్రస్టు సభ్యులు రగ్గులు పంపిణీ చేశారు. చలికాలం దృష్ట్యా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ట్రస్టు ప్రతినిధి రఘురామ్ తెలిపారు. ట్రస్టు సభ్యులు రవి కుమార్, నాయబ్, చంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేయాలి

ప్రజాశక్తి-కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించేలా అంగన్‌వాడీ టీచర్లు చొరవ తీసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ జమ్మిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఎఫ్‌ఎసి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

12 సచివాలయాలకు నలుగురే.. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి వరికుంటపాడు



మండలంలోని 12 సచివాలయాలకు నలుగురే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దిక్కయ్యారు. పని చేయాలంటే విస్తీర్ణంలో ఎక్కువగా ఉండడంతో వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండ లేక నానా అవస్థలు పడుతున్నారు. విరువూరు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా సాయి తేజను నియమించగా అదనంగా పెద్దిరెడ్డిపల్లి తోటల చెరువు పల్లి సచివాలయాలకు ఇన్చార్జిగా నియమించారు. పి.సుధీర్‌బాబు గణేశ్వరాపురం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తుండగా అదనంగా తూర్పు రొంపిదొడ్ల, రామపురం సచివాలయాలకు ఇన్‌ఛార్జిగా నియమిం చారు. ఆర్.నాగబాలుడు, జి.కొండారెడ్డిపల్లికి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా తూర్పు బోయమడుగుల, కాంచెరువుకి అదనంగా నియ మించారు. ఎస్.నాగ ప్రద్యుమ్న తిమ్మారెడ్డిపల్లికి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా వేంపాడు, వరికుంటపాడు సచివాలయాలకు ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఏ పనులు లేకపోవడం తో పెద్ద సమస్య తలెత్తలేదు. ప్రస్తుతం పిఎంఎవై, గ్రామాలలో కూడా సిమెంట్ రోడ్డు పనులు జరుగుతూ ఉన్నాయి. గృహనిర్మాణాలు మొదలయ్యాయి కదా వారు ఎక్కడని ఉండగలరు.. ఎక్కడా ప్రజలకు అందుబాటులో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు కూడా అందుబాటులో ఉండేది కష్టతరమైంది. అధికారులు స్పందించి మిగతా సచివాలయాలకు కూడా రెగ్యులర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నియమిస్తే ఇబ్బందులు ఉండవని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఆగిన ఎండియు వాహనం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మండలం పరిధిలోని పెద్ద అబ్బిపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన మజారా గ్రామమైన చిన్న అబ్బిపురం గ్రామానికి గత ఏడు నెలలుగా ఎమ్‌డి యూనిట్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ నిలిచి పోయిందని, ఆ ఊరి గ్రామస్తులు పత్రికా ముఖంగా తెలియజేశారు. ప్రస్తుతం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అని గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తూ ఉందని, కనీసం పేదలకు ఇచ్చే గింజలు కూడా ఇంటింటికి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సత్వరమే ఇంటింటికి ఎమ్‌డియు వాహనం ద్వారా రైస్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇదే విషయాన్ని తహశీల్దారును ఫోన్‌లో సంప్రదించగా ఆ గ్రామం నుంచి ఒక అర్జీ కూడా తమ దృష్టికి రాలేదని, ఇకపూ తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

పన్నుల వసూళ్లపై సమావేశం



ప్రజాశక్తి-కావలి : కావలి పురపాలక సంఘం పరిధిలోని 28 సచివాలయాలకు సంబంధించి అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలతో పన్నుల వసూళ్ళపై సోమవారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘానికి సంబంధించి ఇంటిపన్ను బకాయిలు, నీటి ఛార్జీల వసూళ్ళపై రెవెన్యూ ఆఫీసర్, కావలి పురపాలక సంఘం కమిషనరు వారి ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు.